07-10-2021 ఉదయము : మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

"మధురమైన పిల్లలూ - చెడు వినకండి. ఒక్క తండ్రి మాటలే వినండి. గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానంగా ఉండాలి"

ప్రశ్న :- ఏ ఆటను గురించి యదార్థంగా తెలుసుకున్న పిల్లలు ఎప్పుడూ తికమకపడరు?

జవాబు :- సుఖ-దు:ఖాలు, భక్తి - జ్ఞానాల ఆట ఏదైతే జరుగుతూ ఉందో, దానిని యదార్థంగా తెలుసుకున్నవారు ఎప్పుడూ తికమకపడరు. భగవంతుడు ఎవ్వరికీ దు:ఖమివ్వరని మీకు తెలుసు. వారు దు:ఖహర్త - సుఖకర్త. ఎప్పుడైతే అందరూ దు:ఖితులుగా అవుతారో, అప్పుడు దు:ఖము నుండి విముక్తి చేసేందుకు వారు వస్తారు.

పాట :- ఈ రోజు ఉదయం ఉదయమే వచ్చిన వారెవరు.... (యహ్ కౌన్ ఆజ్ ఆయా సవేరే సవేరే.... )

ఓంశాంతి. పిల్లలు ఏం విన్నారు? ఇది భక్తిమార్గములోని పాట. ఆంగ్లంలో భక్తిని ఫిలాసఫీ (వేదాంతము) అని అంటారు. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పి.హెచ్.డి) అనే బిరుదు లభిస్తుంది. ఈశ్వరుడెక్కడ ఉంటారు? అని ఎవరినైనా అడగండి. సర్వవ్యాపి అని అంటారు. ఇది కూడా ఒక ఫిలాసఫీయే కదా. ఇప్పుడు శాస్త్రాలలోని విషయాలేవీ తండ్రి వినిపించరు. ఏ భక్తులనూ సాగరమని అనరు. వారిలో జ్ఞానమూ లేదు.వారుజ్ఞానసాగరుని పిల్లలూ కారు. జ్ఞానసాగరులైన తండ్రిని గురించి ఎవ్వరికీ తెలియదు. స్వయాన్ని వారి సంతానమని కూడా భావించరు. వారందరూ భగవంతుని కలుసుకునేందుకు భక్తి చేస్తారు, కానీ భగవంతుడంటే ఎవరో తెలియనప్పుడు భక్తి వలన లాభమేముంది? చాలా మందికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అనే బిరుదు లభించి ఉంటుంది. వారి బుద్ధిలో ఈశ్వరుడు సర్వవ్యాపి అను ఒక్క మాట మాత్రమే ఉంటుంది. వారు దానిని ఫిలాసఫీ అని భావిస్తారు. దాని వల్లనే క్రిందకు దిగజారుతూ వచ్చారు. దీనిని ధర్మగ్లాని అని అంటారు. మనము ఏ మనుష్యులతోనూ శాస్త్రాల గురించి వాదోపవాదాలు చేయము. ఎందుకంటే మనము ఏ మనుష్యుల వద్దా చదువుకోవడం లేదు. మిగిలిన మనుష్యులందరూ మనుష్యుల ద్వారానే చదువుకుంటారు. వేదశాస్త్రాలు మొదలైనవన్నీ మనుష్యుల ద్వారానే చదువుకుంటారు, వాటిని మనుష్యులే తయారు చేశారు. మీకు ఈ జ్ఞానము వినిపించేవారు ఆత్మిక తండ్రి ఒక్కరే. వారు ఒక్కసారి మాత్రమే వచ్చి అర్థం చేయిస్తారు. ఇప్పుడుమనం ఏ మనుష్యులతో ఏదీ నేర్చుకోవలసిన అవసరం లేదు. మీరిప్పుడు ఆత్మిక తండ్రి ద్వారా మాత్రమే వినాలి. వినేవారు ఆత్మిక పిల్లలు, ఆత్మలు. ఆ మనుష్యులంతా మనుష్యులకు వినిపిస్తారు. ఇది ఆత్మిక తండ్రి ఇచ్చే జ్ఞానము, వారిది మనుష్యుల జ్ఞానము. ఈ బాబా(సాకార) కూడా మనిషే అని అంటారు కదా. 'ఇతని ద్వారా ఆత్మిక తండ్రి వినిపిస్తారు, ఆత్మలైన మేము

వింటాము, ఆత్మలమైన మేము ఈ శరీరం ద్వారా ఇతరులకు వినిపిస్తున్నాము' అని చెప్పండి. ఇది ఆత్మిక జ్ఞానము. మిగిలిందంతా శారీరిక జ్ఞానము, భక్తి మార్గంలో శరీరాన్ని పూజిస్తారు. తండ్రి అంటున్నారు - మీరు స్వయాన్ని మనిషిగా గానీ, భక్తునిగా గానీ భావించకండి. స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రి అయిన నన్ను స్మృతి చేయండి. ఆత్మలైన మీరందరూ సోదరులే. ఆత్మ-పరమాత్మలుచాలా కాలం వేరుగా ఉన్నాయనిగాయనముంది. మనము ఏ మనుష్యుల నుండీ వినరాదు. ఎవరైనా ప్రశ్నిస్తే మాది శాస్త్రాల జ్ఞానము కాదు, మేముదానిని ఫిలాసఫి అని అంటాము అనగా భక్తిమార్గపు జ్ఞానము అని చెప్పండి. సద్గతి నిచ్చే జ్ఞానము ఒక్క తండ్రి మాత్రమే ఇస్తారు. సర్వుల సద్గతిదాత ఒక్కరే అని మహిమ చేయబడింది. కావున పిల్లలైన మీరు ఎవ్వరితోనూ వాదించరాదు.



తండ్రి అంటున్నారు - నేను జ్ఞానానికి అథారిటీని, జ్ఞాన సాగరుడను. నేను శాస్త్రాలు మొదలైనవేవీ వినిపించను. ఇది ఆత్మిక జ్ఞానము. మిగిలినదంతా శారీరిక జ్ఞానము. ఆ సత్సంగాలు మొదలైనవన్నీ భక్తిమార్గానికి చెందినవి. ఆత్మిక తండ్రి కూర్చొని ఆత్మలకు అర్థము చేయిస్తున్నారు. కావున దేహీ-అభిమానులుగా అవ్వడంలో పిల్లలకు శ్రమ కలుగుతుంది. ఆత్మలమైన మనము తండ్రి నుండి వారసత్వము తీసుకుంటున్నాము. తండ్రి పిల్లలు తప్పకుండా ఆ తండ్రి సింహాసనానికి వారసులుగా అవుతారు కదా. లక్ష్మీనారాయణులు కూడా దేహధారులే. వారి పిల్లలు దేహధారి తండ్రి నుండి వారసత్వము పొందుకుంటారు. ఈ విషయాలు భిన్నమైనవి. సత్యయుగంలో కూడా శారీరిక విషయాలే ఉంటాయి. అక్కడ ఆత్మిక తండ్రి నుండి వారసత్వం లభిస్తుందని అనరు. దేహాభిమానాన్ని తొలగించాలి. మనము ఆత్మలము. ఇప్పుడు తండ్రిని స్మృతి చేయాలి. ఇదే భారతదేశ ప్రాచీన రాజయోగమని మహిమ చేయబడింది. స్మృతి(యాద్)

అను పదము హిందీ భాషలోనిది. కావున ఈ జ్ఞానమునిప్పుడు ఎవరు ఇస్తున్నారో ఏ మనుష్యులకూ తెలియదు. జన్మ-జన్మాంతరాలుగా మనుష్యులు మనుష్యులతో మాట్లాడుతూ వచ్చారు. ఇప్పుడు ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలతో మాట్లాడుతున్నారు. ఆత్మలు వింటున్నారు అందువలన దీనిని ఆత్మిక(ఆధ్యాత్మిక) జ్ఞానమని అంటారు. గీతను కూడా వారు ఆధ్యాత్మిక జ్ఞానంగా భావిస్తారు, కానీ అందులో దేహధారి అయిన కృష్ణుని పేరు వేసేశారు. తండ్రి అంటున్నారు - ఏ మనిషిలోనూ ఈ జ్ఞానము లేదు. ఎప్పుడైనా, ఎవరైనా మీతో వాదిస్తే వారికిలా చెప్పండి - ఇది మీకు తెలిసిన భక్తి జ్ఞానము. ఇది మనుష్యులచే తయారుచేయబడిన శాస్త్రాల జ్ఞానము. సత్యమైన జ్ఞానము ఒక్క జ్ఞానసాగరుడైన తండ్రి వద్ద మాత్రమే ఉంది. ఇప్పుడు వారే స్వయంగా జ్ఞానము ఇస్తున్నారు. వారిని సుప్రీమ్ తండ్రి అని కూడా అంటారు. ఆ నిరాకారునికి పూజ కూడా జరుగుతుంది. ఒకవేళ ఇతర నిరాకారుల పూజ ఏదైతే జరుగుతుందో అది కూడా వారి పిల్లల పూజయే. మట్టితో సాలిగ్రామాలను తయారు చేసి పూజిస్తారు. రుద్ర యజ్ఞము రచిస్తారు. ఆ పరమపిత పరమాత్మ నిరాకార లోకంలో ఉంటారని మీకు తెలుసు. ఆత్మలైన మీరు కూడా అక్కడే ఉంటారు. ఆ జ్ఞాన సాగరులు వచ్చి జ్ఞానము వినిపించి అందరికీ సద్గతినిస్తారు. వారు అత్యంత ఉపరి భాగంలో ఉండు పరమపిత పరమాత్మ. ఆత్మలందరూ సోదరులు. వారందరికి పాత్ర లభించింది. వారు శరీరాన్ని ధారణ చేసుకొని సోదరీ - సోదరులుగా అవుతారు. ఆత్మలందరూ ఒకే తండ్రి పిల్లలు. ఆత్మ శరీరాన్ని ధరించినప్పుడు స్వర్గంలో సుఖాన్ని, నరకంలో దు:ఖాన్ని పొందుతుంది. ఇలా ఎందుకు జరుగుతుంది? జ్ఞానము మరియు భక్తి గురించి అర్థం చేయించబడింది. అది పగలు, ఇది రాత్రి. జ్ఞానము వలన సుఖము, భక్తి వలన దు:ఖము కలుగుతుంది. ఇది తయారు చేయబడిన ఆట(డ్రామా). అంతేగానీ దు:ఖము, సుఖము అన్నీ భగవంతుడే రచిస్తారని కాదు. దు:ఖితులైనప్పుడే భగవంతుని పిలుస్తారు వారు సుఖమిచ్చేవారని భావిస్తారు. సుఖము పూర్తి అవుతూనే, మళ్ళీ రావణుని పంచ వికారాల వలన దు:ఖము ప్రారంభమౌతుంది, ఇదే ఆట. దీనిని యదార్థ పద్ధతిలో అర్థము చేసుకోవాలి. దీనినే ఆత్మిక జ్ఞానమని అంటారు. మిగిలినదంతా శారీరిక జ్ఞానము. అది మేము వినదలచుకోలేదు. ‘ కేవలం నిరాకారతండ్రినైన నా ద్వారా మాత్రమే వినండి ’ అని మాకు ఆజ్ఞ లభించింది. చెడు వినకండి అని తండ్రి చెప్తున్నారు. మేము ఒక్క భగవంతుని నుండి మాత్రమే వింటాము. మీరు మనుష్యుల ద్వారా వింటున్నారు. రెండిటికి రాత్రికి, పగలుకు ఉన్నంత వ్యత్యాసముంది. పెద్ద- పెద్ద విద్వాంసులు మొదలైనవారు శాస్త్రాలు మొదలైన వాటిని చదువుతారు. అవి మేము కూడా చాలా చదివాము. ఇప్పుడు భగవంతుడంటున్నారు - మీరు చాలా మంది గురువులను ఆశ్రయించారు. ఇప్పుడు వారిని వదిలేయండి. నేను ఏం వినిపిస్తున్నానో అది మాత్రమే

వినండి. భగవంతుడు నిరాకారుడు. వారి పేరు శివుడు. ఇప్పుడు మేము వారి ద్వారా వింటున్నాము. తండ్రి స్వయంగా తమ పరిచయాన్ని, తమ రచన ఆదిమధ్యాంతాల పరిచయాన్ని ఇస్తున్నారు. అటువంటప్పుడు మేము మీ నుండి శాస్త్రాలు మొదలైనవి ఎందుకు వినాలి! మేము మీకు ఆత్మిక జ్ఞానము వినిపిస్తాము. వినాలనుకుంటే వినండి. సంశయపడే విషయమేదీ లేదు. ప్రపంచమంతా ఒకవైపు, రెండవ వైపు మీరు చాలా కొద్ది మంది మాత్రమే ఉన్నారు. తండ్రి అంటున్నారు - నన్ను స్మృతి చేస్తే మీ పై ఉన్న పాపభారం తొలగిపోయి మీరు పవిత్రంగా అవుతారు. ఎవరు పవిత్రంగా అవుతారో వారే పవిత్ర ప్రపంచానికి యజమానులుగా అవుతారు. ఇప్పుడు పాత ప్రపంచం పరివర్తనవ్వనున్నది.



కలియుగము తర్వాత సత్యయుగము వస్తుంది. సత్యయుగము పావన ప్రపంచం. మీరు వచ్చి పావన ప్రపంచాన్ని తయారు చేయమని నన్ను కలియుగంలోనే పిలుస్తారు.నేనిప్పుడు అందుకే వచ్చాను. మీరు నన్నొక్కరినే స్మృతి చేయండి. ఇప్పుడు ప్రపంచం పరివర్తనౌతూ ఉంది. ఇది మీ అంతిమ జన్మ. ఈ పాత ప్రపంచంలో ఆసురీ రాజ్యము సమాప్తమై, రామ రాజ్యము స్థాపనౌతూ ఉంది. అందువలన ఈ అంతిమ జన్మలో గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానం పవిత్రంగా అవ్వండి. ఇది విషయ సాగరం కదా. కమలపుష్పం నీటి పై తేలుతూ ఉంటుంది. కనుక ఇప్పుడు మీరు గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానంగా పవిత్రంగా అవ్వండి. మనము రాజ్య స్థాపన చేస్తున్నామని పిల్లలైన మీకు తెలుసు. ఇప్పుడు ప్రపంచమంతా పరివర్తన అవుతూ ఉంది. ఆ ధర్మ స్థాపకులు కేవలం వారి వారి ధర్మాలను స్థాపన చేస్తారు. మొదట వారు పవిత్రంగా

ఉంటారు, తర్వాత పతితులుగా అవుతారు. సద్గురువు ఒక్కరే సద్గతిదాత. మనుష్యులు సద్గతికి వెళ్ళాలనుకున్నప్పుడు గురువులను ఆశ్రయిస్తారు. పాపము పెరిగినప్పుడు ఆత్మిక తండ్రి వచ్చి జ్ఞానాన్ని వినిపిస్తారు. భక్తికి ఫలమైన జ్ఞానము మీకు భగవంతుని ద్వారా లభిస్తుంది. భగవంతుడు భక్తిని నేర్పించరు. వారు జ్ఞానమునిస్తారు. నన్ను ఒక్కరినే స్మృతి చేస్తే మీ వికర్మలు వినాశనమౌతాయి. పావనమయ్యేందుకు వేరే దారే లేదు. నూతన ప్రపంచంలో అందరూ స్వర్గ వాసులుగా ఉంటారు. ఇప్పుడు పాత ప్రపంచంలో అందరూ నరకవాసులే. అందువలన తండ్రి అంటున్నారు - నేను అందరినీ ఉద్ధరించేందుకువస్తాను. నేనే వచ్చి అందరికీ ఆత్మిక జ్ఞానమునిస్తాను. నేను మీ తండ్రిని అని తండ్రి తమ పరిచయమునిస్తున్నారు. ఇప్పుడిది నరకం. నూతన ప్రపంచాన్ని స్వర్గమని అంటారు. ఇక్కడే స్వర్గము, నరకము ఉన్నాయని ఎలా అంటారు. ఎవరి వద్ద చాలా ధనముందో వారు స్వర్గంలో ఉన్నామని భావిస్తారు. స్వర్గము నూతన ప్రపంచంలో ఉంటుంది. ఇక్కడ స్వర్గమెక్కడ ఉంది! అందువలన మేము ఏ మనుష్యుల మాటలూ వినము అని చెప్పండి. తండ్రి అంటున్నారు - మీరు తమోప్రధానం నుండి సతోప్రధానంగా అవ్వాలంటే నన్నొక్కరినే స్మృతి చేయండి. రోజంతా ఈ జ్ఞానము మీ బుద్ధిలో ఉండాలి. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. ఒక్క తండ్రితో మాత్రమే ఆత్మిక విషయాలు వినాలి. ఎవరితోనూ ఇతర విషయాల పై వాద వివాదాలు చేయరాదు.

2. దేహీ-అభిమానులుగా అయ్యే శ్రమ చేయాలి. సతోప్రధానంగా అయ్యేందుకు ఒక్క తండ్రి స్మృతిలోనే ఉండాలి.

వరదానము :- " తండ్రి చేయి మరియు తోడు యొక్క స్మృతి ద్వారా కష్టాన్ని సులభం గా చేసుకునే బేఫికర్ లేక నిశ్చింత భవ "

ఎవరైనా పెద్దవారి చేతిలో చేయి ఉంటే వారి స్థితి నిశ్చింతగా ఉంటుంది. అలా ప్రతి కర్మలో బాప్‌దాదా నా జతలో ఉన్నారని భావించాలి. అంతేకాక ఈ అలౌకిక జీవితం యొక్క చేయి వారి చేతిలో ఉంది, అనగా మా జీవితం వారి అధీనం కనుక మా బాధ్యత కూడా వారిదే అవుతుంది. భారమంతా తండ్రి పై ఉంచి స్వయాన్ని తేలికగా చేసుకోండి. బరువును దించుకునే సాధనం లేక కష్టాన్ని సులభంగా చేసుకునే సాధనమే - తండ్రి చేయి మరియు తోడు.

స్లోగన్ :- " పురుషార్థంలో సత్యత ఉంటే బాప్‌దాదా నుండి అదనపు సహాయాన్ని అనుభవం చేస్తారు "

## మాతేశ్వరిగారి అమూల్యమైన మహావాక్యాలు

### 1. జీవితానికి ఆధారం జ్ఞానము - యోగము మరియు దైవీ గుణాల ధారణ

మనకు పరమపిత పరమాత్ముని ద్వారా జ్ఞానము లభిస్తూ ఉందని మనకు నిశ్చయముంది. ఈ జ్ఞానంలో ముఖ్యంగా మూడు పాయింట్లు ఉన్నాయి. వాటి కొరకు మనము పూర్తిగా పురుషార్థము చేయాలని గమనముంచుకోవాలి. ఇందులో మొదటిది - యోగము లేక నిరంతర ఈశ్వరీయ స్మృతి. దీని ద్వారా వికర్మలు వినాశనమౌతాయి. రెండవది - జ్ఞానము అనగా ఈ మొత్తం బ్రహ్మాండము, సృష్టి ఆదిమధ్యాంతాలు ఎలా ఉంటాయనే జ్ఞానము. ఈ జ్ఞానమున్నప్పుడే ఈ జీవితంలో ప్రాక్టికల్‌గా పరివర్తన వస్తుంది, అంతేకాక మనము భవిష్య ప్రాలబ్ధాన్ని మంచిగా చేసుకోగలము. మూడవ పాయింటు - మనము సర్వగుణ సంపన్నంగా 16 కళా సంపూర్ణంగా తప్పకుండా అవ్వాలి, అప్పుడే దేవతలుగా అవ్వగలము. కనుక నడుస్తూ, తిరుగుతూ, తింటూ, త్రాగుతూ ఈ మూడు పాయింట్లపై గమనమివ్వడం అవసరము. ఈ ఒక్క జన్మలోనే జ్ఞానబలము, యోగబలము మరియు దైవీగుణాలధారణ చేయబడ్తుంది. మూడింటికి పరస్పర సంబంధముంది - జ్ఞానం లేకుండా యోగం చేయలేము, యోగం లేకుండా దైవీ గుణాల ధారణ జరగదు. ఈ మూడు పాయింట్ల పైనే మొత్తం జీవితమంతా ఆధారపడి ఉంది. అప్పుడే వికర్మల ఖాతా సమాప్తమై మంచి కర్మలు తయారవుతాయి దీనినే ఈశ్వరీయ జీవితమని అంటారు.

### 2. పరమాత్ముని ద్వారా నేర్పించబడిన భారతదేశ ప్రాచీన యోగము

మన ఈశ్వరీయ యోగము భారతదేశంలో ప్రాచీన యోగమని ప్రసిద్ధి చెందింది. ఈ యోగాన్ని అవినాశి యోగమని ఎందుకు అంటారు? ఎందుకంటే అవినాశి పరమాత్మ ద్వారా నేర్పించబడింది. భలే ఇతర మనుష్యులు కూడా యోగం నేర్పిస్తారు. అందుకే యోగాశ్రమాలు వగైరా తెరుస్తూ ఉంటారు. అయితే వారు ప్రాచీన యోగాన్ని నేర్పించలేరు. ఇటువంటి యోగమే అయితే ఆ బలము ఎక్కడుంది? భారతదేశం రోజురోజుకు నిర్బలమౌతూ ఉంది. కనుక ఆ యోగము అవినాశి యోగము కాదని ఋజువు అవుతుంది. ఎవరితో యోగము జోడించాలో అది వారే స్వయంగా నేర్పిస్తారు. ఇంకెవ్వరితోనూ యోగం జోడించరాదు కనుక ఎలా నేర్పిస్తారు? ఈ పని స్వయం పరమాత్ముడే చేయగలడు. వారే మనకు పూర్తి భేదమంతా తెలుపగలరు. ఇకపోతే అందరూ మేము యోగం నేర్పిస్తామని అంటూ ఉంటారు. సత్యమైన యోగము స్వయం పరమాత్మయే నేర్పించి సూర్యవంశి, చంద్రవంశి కుటుంబాలను మరియు దైవీ రాజ్యాన్ని

స్థాపన చేస్తారని మనకు తెలుసు. ఇప్పుడూ ప్రాచీన యోగాన్ని కల్ప-కల్పము పరమాత్ముడు వచ్చి మనకు నేర్పిస్తారు. ఇప్పుడు వారు ఓ ఆత్మలారా, పరమాత్ముడైన నాతో నిరంతరం యోగం జోడిస్తే మీ పాపాలు నశిస్తాయని అంటున్నారు. అచ్ఛా.

-: ఓంశాంతి :-